రోడ్ల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత

ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

సాక్షి, భీమవరం: నియోజకవర్గంలో రోడ్లకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఆయన క్యాంపు కార్యాలయంలో ఏపీ ఆర్‌డీసీ చైర్మన్, నియోజకవర్గ పరిశీలకుడు కనుమూరు సుబ్బరాజు (రాజబాబు) ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో కొన్నిచోట్ల రోడ్లను నిర్మించడం, మరికొన్ని రోడ్లకు మరమ్మతులు చేపట్టామన్నారు. నియోజకవర్గంలో పలు రోడ్లకు సంబంధించిన ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటికి వెంటనే నిధులు మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సుబ్బరాజుకు సూచించారు.

మార్కెట్‌యార్డుల ద్వారా ఉత్తమ సేవలు

రైతులకు ఉత్తమ సేవలందించడంలో మార్కెట్‌యార్డు కమిటీలు పోటీపడాలని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. భీమవరం మార్కెట్ యార్డుకు నూతనంగా ఎన్నికైన చైర్మన్ కోటిపల్లి బాలదుర్గానాగమల్లేశ్వరరావు(బాబు) డైరెక్టర్లు మంగళవారం ఎమ్మెల్యే శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలు అమలుచేస్తున్నారని ప్రధానంగా రైతులు పండించిన ధాన్యాన్ని గిట్టుబాటు ధరకు ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు మార్కెట్ యార్డుల ద్వారా రైతులకు అందించే విధంగా నూతన పాలకవర్గం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ వేండ్ర వెంకటస్వామి, గొలగాని సత్యనారాయణ, నాగరాజు శ్రీనివాసరాజు, వర్మ, ముద్దల కరుణ్ కుమార్, భూసారపు లక్ష్మీ ప్రసన్న, యర్రంశెట్టి శ్రీనివాస్, గాదిరాజు రామరాజు తదితరులు పాల్గొన్నారు.



రాజబాబుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



ఎమ్మెల్యే శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు చెబుతున్న దృశ్యం

క్లుప్తంగా

ఆకివీడు చేరుకున్న ప్రత్యేక హోదా యాత్ర

ఆకివీడు: ప్రత్యేక హోదాతోనే పరిశ్రమలు, ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని ప్రత్యేక హోదా సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాస్ అన్నారు. ఈ నెల 25న బయలుదేరిన యాత్ర మంగళవారం ఆకివీడు చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక వైఎస్సార్ సెంటర్‌లో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్ర విభజన సమయంలోనూ, ఎన్నికల సమయాల్లో ఇచ్చిన హామీల్ని అమలుజేయడం లేదని ధ్వజమెత్తారు. ప్రత్యేక హోదా, విభజన హామీల అమలుకు యువత ఉద్యమించాలని పిలుపునిచ్చారు. డీవైఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు వై.రాము, ఎస్‌ఎఫ్‌ఐ ఉమ్మడి జిల్లా కార్యదర్శి మంతెన సీతారామ్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి పెద్దిరాజు, డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి గేదల ధనూష్ పలువురు విద్యార్థులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా సత్తెమ్మ అమ్మవారి జాతర

ఉండి: పెదపుల్లేరు గ్రామ దేవత సత్తెమ్మ అమ్మవారి 58వ వార్షిక జాతర మహోత్సవాలు నాలుగో రోజు మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి విశేష అలంకరణ అనంతరం నిర్వాహకులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే మ్యూజిక్, మిమిక్రీ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. తొమ్మిది రోజుల పాటు నిర్వహించే ఉత్సవాలలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు జరగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ కలిదిండి రామకృష్ణంరాజు తెలిపారు.

ప్రతి ఒక్కరికీ చట్టాలపై అవగాహన అవసరం

ఉండి: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అప్పుడే రాజ్యాంగం మనకు కల్పించిన హక్కులు, బాధ్యతలు, విధులపై పూర్తి అవగాహన కలుగుతుందని భీమవరం సీనియర్ సివిల్ జడ్జి బి.అప్పలస్వామి అన్నారు. ఉండి మండలం వాండ్రంలో గ్రామ సర్పంచ్ దాసరి వెంకటకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ వీధి బాలల దినోత్సవాన్ని సందర్భంగా మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పలస్వామి మాట్లాడుతూ చట్టంపై అందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. అప్పుడే మంచి చెడును తెలుసుకుని తప్పులు చేయకుండా బాధ్యతగా వ్యవహరిస్తామన్నారు. భీమవరం బార్ కౌన్సిల్ అధ్యక్షుడు ఏలేటి న్యూటన్ మాట్లాడుతూ 14 ఏళ్లలోపు బాలబాలికలకు నిర్బంధ విద్య అమలు చేయాలన్నారు. అనాథలుగా మారిన అనేకమంది వీధి బాలలను ఆదరించాలని, వారి హక్కులు వారికి అందించాలన్నారు. ఫిబ్రవరి 11వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సర్పంచ్ దాసరి వెంకటకృష్ణ, గ్రామ కార్యదర్శి జేవీటీ నాయుడు, ప్యానల్ న్యాయవాదులు అంబేడ్కర్, నవీన్, సునీల్, లోకేష్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన

భీమవరం(ప్రకాశం చౌక్): శ్రీమావుళ్లమ్మ అమ్మవారి 59 వార్షికోత్సవ మహోత్సవాల్లో మంళవారం మధ్యాహ్నం 3 గంటలకు జగన్నాథపు వెంకటేశ్వరరావు ఉరదాలపాలెం వారితో భగవత్ పారాయణ, సాయంత్రం 4 గంటలకు ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం భీమవరం వారితో ఆధ్యాత్మిక ప్రవచనం , సాయంత్రం 5 గంటలకు రాగరవళి సంగీత నృత్య కళాక్షేత్రం తణుకు వారితో కూచిపూడి నృత్యం, సాయంత్రం 6 గంటలకు ఎస్.భారతి భాగవతారిణి ఏలూరు వారితో హరికథ, రాత్రి 8 గంటలకు సోని ఆర్కెస్ట్రా భీమవరం వారితో సినీ సంగీత విభావరి అలరించాయి.

అమ్మవారి ఉత్సవాల్లో నేడు

శ్రీ మావుళ్లమ్మ అమ్మవారి 59 వార్షికోత్స ఉత్సవాల్లో బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు భగవత్ పారాయణ, సాయంత్రం 4 గంటలకు ఆధ్యాత్మిక ప్రవచనం , సాయంత్రం 5 సిని మ్యూజికల్ నైట్, 8 గంటలకు రెండు రత్నాలు కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

గోస్తనీ నది తీర్థోత్సవాలు ప్రారంభం

పాలకోడేరు: మోగల్లులో గోస్తనీ నది 92వ తీర్థోత్సవాలను మంగళవారం వైభవంగా ప్రారంభించారు. తొలుత గ్రామంలోని ఆంజనేయ లక్ష్మణ సమేత సీతారామచంద్ర మహారాజు, పద్మావతి సహిత వేంకటేశ్వర స్వామివారి ఆలయాల్లో పండితులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నాలుగు బృందాలతో ఏకాహం నిర్వహించారు. సాయంత్రం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు చేశారు. కార్యక్రమాలను ఏఎస్ఆర్ సమితి, గోస్తనీ నది తీర్థోత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

కోడి పందేల స్థావరంపై దాడి

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం కోడి పందేల స్థావరం పై పోలీసులు దాడులు చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం దిరుసుమర్రు గ్రామంలోని గొల్లగూడెంలో కోడి పందేలపై పోలీసులు దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి మూడు కోడి పుంజులు, రెండు కోడి కత్తులు, రూ.8,100 నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై ఏఎస్సై ఆకురాతి సూర్యనారాయణ కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

జగనన్న కాలనీలో సబ్‌స్టేషన్ నిర్మాణానికి భూమిపూజ

ఆకివీడు: జగనన్న కాలనీలో మౌలిక వసతులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని, లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్లు నిర్మించుకోవాలని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. మండలంలోని కుప్పనపూడి శివారు తాళ్లకోడులోని జగనన్న కాలనీలో విద్యుత్ సదుపాయం కలిపించేందుకు 33 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణానికి మంగళవారం పీవీఎల్, నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీలో 3,600 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేశామన్నారు. వారిలో 3,400 మంది ఇళ్ల నిర్మాణానికి ముందుకు వచ్చారని ఇప్పటివరకు 50 శాతం మేర ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. ఇప్పటికే ఆయా ప్లాట్ల మధ్య వేసిన రోడ్లు నిర్మాణ మెటీరియల్ తీసుకురావడంతో అక్కడక్కడా పాడయ్యాయని చెప్పారు. జిల్లా కలెక్టర్ నిధులు రూ.20 లక్షలతో ప్రధాన గ్రావెల్ రోడ్డు నిర్మాణం జరుగుతోందన్నారు. మరో రూ.20 లక్షల నిధులు మంజూరుకు ప్రయత్నిస్తున్నామన్నారు. ఇప్పటికే కాలనీలో 420కి పైగా విద్యుత్ స్తంభాలు నెలకొల్పారని, 40 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. లబ్ధిదారులు అధిక శాతం ఉన్నందున కాలనీలో లోఓల్టేజ్ రాకుండా 8 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌తో సబ్‌స్టేషన్ నిర్మాణం రూ.3.20 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్నట్లు చెప్పారు. మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ నంద్యాల సీతారామయ్య మాట్లాడుతూ తాళ్లకోడులోని జగనన్న కాలనీలో లబ్ధిదారులు అధిక శాతం ఇళ్ల నిర్మాణం చేపట్టారని చెప్పారు. ఇళ్ల నిర్మాణానికి పైపులైన్ సౌకర్యం కల్పించారని, రోడ్ల నిర్మాణం జరిగిందన్నారు. కనస్ట్రక్షన్ ఈఈ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జగనన్న కాలనీలో విద్యుత్ సదుపాయం కల్పించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి అయ్యాయని చెప్పారు. సబ్ స్టేషన్ నిర్మాణంతో లోఓల్టేజ్ సమస్య ఉండదన్నారు. కాలనీలో ఇళ్ల నిర్మాణం పూర్తి అయిన ప్రతీ ఇంటికీ బోర్డు,మీటరు, సర్వీస్ వైరుతో పాటు ఉచిత కనెక్షన్ ఇస్తున్నట్లు చెప్పారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, మాజీ ఎంపీటీసీ అంబటి రమేష్, కనస్ట్రక్షన్ ఏడీఈ చంద్రశేఖర్, ఏడీఈ రాంబాబు, ఏఈలు ప్రసాదరాజు తదితరులు పాల్గొన్నారు.



తాళ్లకోడులో సబ్‌స్టేషన్ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరావు

నేడు ఆకివీడులో గడపగడపకు మన ప్రభుత్వం

ఆకివీడు: ఆకివీడు నగర పంచాయతీ 4వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు జరుగుతుందని నగర పంచాయతీ కమిషనర్ తిరుమలరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు, చైర్‌పర్సన్ జామి హైమావతి, ఇతర ప్రజాప్రతినిధులు హాజరవుతారన్నారు. నగర పంచాయతీ సిబ్బంది, వలంటీర్లు పాల్గొనాలని కోరారు.

జగనన్న ద్వారానే బీసీలకు లబ్ధి



నాయీ బ్రాహ్మణ సంఘ నాయకులతో కోడే యుగంధర్

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం పట్టణ నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు మలువలస రఘు జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కోడె యుగంధర్‌ను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భీమవరం పట్టణంలో నాయి బ్రాహ్మణులకు ఒక మంచి పేరు ప్రత్యేక పేరు ఉందని అందులో భాగంగానే సంఘాన్ని కూడా ముందుకు తీసుకెళ్లాలన్నారు. నాయీ బ్రాహ్మణులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జగనన్న తోడు కార్యక్రమం ద్వారా రూ.10 వేలు వేస్తున్నారన్నారు. అందులో భాగంగా లబ్ధిదారులు ఎవరైనా ఉంటే వారిని ప్రతిపాదించి అందరికీ లబ్ధి కలిగేలా చూడాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కోడె యుగంధర్ అన్నారు. కార్యక్రమంలో తురువాల దుర్గాప్రసాద్, ఉపాధ్యక్షులు మలువలస మావుళ్ళు, వ్యాపాడ పెద్దిరాజు, సహాయ కార్యదర్శులు సారిక దుర్గారావు, తుంపాల నరేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

11న జాతీయ లోక్‌అదాలత్

సాక్షి, భీమవరం: ఫిబ్రవరి 11వ తేదీన నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌ను ఉపయోగించుకుని రెవెన్యూ, మునిసిపల్ డిపార్ట్‌మెంట్‌లకు సంభందించి పన్ను రూపంలో వసూలు చేసే బకాయిలను ప్రీ లిటిగేషన్ కేసుల ద్వారా పరిష్కరించుకోవాలని భీమవరం సీనియర్ సివిల్ జడ్జి బి.అప్పలస్వామి చెప్పారు. మంగళవారం తన ఛాంబర్‌లో భీమవరం ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్, ఆకివీడు నగర పంచాయతీ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్లతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి అప్పలస్వామి మాట్లాడుతూ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఉన్న భూ సేకరణకు సంబంధించిన కేసులపై ప్రత్యేక దృష్టి సారించి కక్షిదారులతో మాట్లాడి రాజీ చేయడానికి కృషి చేయాలన్నారు. అలాగే మున్సిపాల్టీ పంచాయతీయాక్ట్ ప్రకారం లోక్‌అదాలత్ ద్వారా పరిష్కరించదగిన పన్నుల రూపంలో బకాయిలను గుర్తించి వాటిని కూడా పరిష్కరించే దిశగా ప్రయత్నించాలని ఆదేశించారు. ఇప్పటికే పారా లీగల్ వాలంటీర్లు గ్రామాలలో జాతీయ లోక్ అదాలత్ పై అవగాహన కల్పిస్తున్నారని గ్రామ, వార్డు వలంటీర్స్ ద్వారా కూడా గ్రామాల్లో అవగాహన కల్పించేందుకు సహకరించాలన్నారు. ఈ సమావేశంలో మునిసిపల్ కమిషనర్ సబ్బి శివరామకృష్ణ ,సురేష్ తదితరులు పాల్గొన్నారు.



జాతీయ లోక్ అదాలత్ గురించి వివరిస్తున్న జడ్జి అప్పలస్వామి

రైతు మేలు కోసమే రీసర్వే

భీమవరం అర్బన్: భూ వివాదాలు లేకుండా శాశ్వతంగా భూ హక్కు పత్రాలను రైతులకు అందజేసి వారికి మేలు చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు–భూ రక్ష పథకాన్ని ప్రవేశపెట్టారని తహసీల్దార్ వై. రవికుమార్ అన్నారు. మండలంలోని యనమదుర్రు గ్రామపంచాయతీలోని డేగాపురంలో వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు భూ రక్ష పథకంలో భాగంగా మంగళవారం డ్రోన్ సహాయంతో భూములు రీ సర్వే చేసే కార్యక్రమం చేపట్టారు. తహసీల్దార్ వై. రవికుమార్ మాట్లాడుతూ రైతులు ఎక్కువగా తమ పొలాల వద్ద సర్వే నెంబర్లు తెలియక, రికార్డుల్లో భూ వివరాలు ఒకలాగా, క్షేత్రస్థాయిలో భూమి విస్తీర్ణం తక్కువ ఎక్కువలు ఉండటంతో రైతులు సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. అలాగే సర్వే నెంబర్లు తెలియక, సరిహద్దులు ఎక్కడ వరకూ ఉన్నాయో? నిర్ధారణ కాకపోవడంతో రైతులు తీవ్ర సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. ఆధునిక టెక్నాలజీని ఉపయోగించి రోవర్ పరికరాల ద్వారా ఖచ్చితత్వంతో సర్వే చేసి రైతులకు శాశ్వత భూ హక్కు పత్రాలను ఇవ్వడం జరుగుతుందన్నారు.1932లో భూములను సర్వే చేశారని ఇప్పుడు టెక్నాలజీని ఉపయోగించి ఎవరూ మోసం చేయని విధంగా కచ్చితమైన కొలతలతో భూ సర్వే నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఇలాంటి కార్యక్రమాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బూరబత్తుల రామ్మూర్తి, ఉప సర్పంచ్ తిరుమల విజయరామ్, రీ సర్వే డీటీ ఎస్ఎస్‌వీ ప్రసాద్, డీఐఓఎస్ టి.వెంకటేశ్వరరావు, ఆర్ఐ ఆది శేషు నాయుడు, మండల సర్వేయర్లు రామాబాయి, నాగబాబు, వీఆర్వో హుస్సేన్‌లాల్, కార్యదర్శి జి.సత్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.



దేగాపురంలో రీ సర్వేను డ్రోన్ సహాయంతో ప్రారంభిస్తున్న తహసీల్దార్ వై. రవికుమార్

జగన్ పాలనలో ప్రతి ఇంటా సంతోషం

- డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు
- పల్లిపాలెంలో గడపగడపకు మన ప్రభుత్వం

కాళ్ల: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని, దీంతో లబ్ధిదారులంతా ఎంతో ఆనందంగా ఉన్నారని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. ప్రాతళ్లమెరక సచివాలయం పరిధిలోని పల్లిపాలెం గ్రామంలో రెండో రోజు మంగళవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో పీవీఎల్ ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అమలుపై అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు పొందుతున్న లబ్ధిదారుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. చిన్న గ్రామాల్లో సైతం వైఎస్ జగన్ పాలనలో లబ్ధి పొందుతున్న కుటుంబాలే ఉన్నాయన్నారు. ప్రతి ఇంట్లో చేయూత, డ్వాక్రా రుణమాఫీ, మత్స్యకార భరోసా ద్వారా లబ్ధి పొందుతున్నారన్నారు. ఏ ఇంటికి వెళ్లిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన బాగుందని మహిళలు చెబుతున్నారని ధీమా వ్యక్తం చేశారు. గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సంక్షేమ పథకాలు అందిస్తూ ప్రతి కుటుంబానికి భరోసానిస్తున్నారన్నారు మత్స్యకార గ్రామమైన పల్లిపాలెం గ్రామానికి సుమారు ఏడు కోట్ల రూపాయలు సంక్షేమ పథకాల రూపంలో అందించారని చెప్పారు. గ్రామంలో చిన్న చిన్న సమస్యలు, రహదారుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇన్ని సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన ఆవశ్యకత ప్రతి ఒక్కరిపై ఉందని చెప్పారు. ఎంతమంది ఏకమైనా 175కి 175 సీట్లు గెలవటం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు వల్లనే ప్రతి ఇంటికీ ధైర్యంగా వెళ్లగలుగుతున్నామన్నారు. ఎన్నికలు ఇప్పట్లో లేనప్పటికీ ప్రజలు యోగక్షేమాలు తెలుసుకునేందుకే సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేవా తెలుసుకునేందుకు గడపగడపకు వస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రజలంతా జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉంటారని ధీమా వ్యక్తం చేశారు. ఉండి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగరవేసి సీఎంకు కానుకగా ఇవ్వాలని కోరారు. ఎవరి పాలనలో మేలు జరిగిందో ప్రజలు గుర్తించాలన్నారు. గ్రామానికి విచ్చేసిన పీవీఎల్‌కు గ్రామ ప్రజలు హారతులు పట్టి ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ గణేశ్న రాంబాబు, కలవపూడి సొసైటీ పెన్మెత్స ప్రసాదరాజు, వేగేశ్న బాల గణపతివర్మ, సాగిరాజు హరివర్మ, బొడ్డు రామకృష్ణ, గాది వెంకటేశ్వరరావు, తిరుమని వెంకట నరసయ్య, తిరుమణి కృష్ణ, నడికుర్తి నాగరాజు, మోకా వెంకటరామరాజు, వేజెళ్ల సతీష్, పెన్మెత్స రంగరాజు, షేక్ హుస్సేన్, పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.



పల్లిపాలెంలో లబ్ధిదారులకు బ్రోచర్‌ను అందిస్తున్న పీవీఎల్ నర్సింహరాజు

అభివృద్ధిని అడ్డుకోవడం ప్రతిపక్ష కౌన్సిలర్లకు తగదు

ఆకివీడు: నగర పంచాయతీ అభివృద్ధిని ప్రతిపక్ష మహిళా కౌన్సిలర్లు అడ్డుకుంటున్నారని నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి, అధికార పక్ష కౌన్సిలర్లు ఆరోపించారు. స్థానిక నగర పంచాయతీ సాధారణ కౌన్సిల్ సమావేశం మంగళవారం చైర్‌పర్సన్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో అజెండాలో పొందుపరిచిన అంశాల్ని ప్రస్తావిస్తుండగా ప్రతిపక్ష మహిళా కౌన్సిల్ సభ్యులు తమకు తెలియకుండా తమ వార్డులో వర్కులు ఏ విధంగా అజెండాకు తీసుకువచ్చారని ప్రశ్నించారు. దీనిపై చైర్‌పర్సన్ హైమావతి, విప్ పడాల శ్రీనివాసరెడ్డి, వైస్‌చైర్మన్లు వంగా జ్యోత్స్న, పుప్పాల పండులతో పాటు పలువురు కౌన్సిలర్లు ప్రతిపక్ష సభ్యుల ఆరోపణల్ని తిప్పికొట్టారు. ఆయా వార్డుల్లో సమస్యల్ని కౌన్సిలర్లు తమ దృష్టికి తీసుకురాలేదని, ఇబ్బంది పడుతున్న ప్రజలు తెలియజేయడంతో ప్రాధాన్యతా క్రమంలో పనులకు నిధులు కేటాయించామని చెర్‌పర్సన్ చెప్పారు. ఆర్థిక సంవత్సరాంతానికి నిధులు వెచ్చించాల్సి ఉన్నందున వర్కులు త్వరితగతిన పూర్తి చేయాల్సి ఉందన్నారు. అయినప్పటికీ ప్రతిపక్ష మహిళా కౌన్సిల్ సభ్యులు నిరసన వ్యక్తం చేస్తూ గందరగోళం సృష్టించారు. అభివృద్ధి పనులకు రాజకీయం చేయడం తగదని అజెండాలోని అన్ని పనులను ఆమోదిస్తూ మెజార్టీ సభ్యులు తీర్మానం చేశారు. సమావేశంలో కమిషనర్ తిరుమలరావు, మేనేజరు వెంకటేశ్వరరావు, కౌన్సిల్ సభ్యులు కట్టార వి, నిమ్మల నాగు, గేదల అప్పారవు, మోటుపల్లి కుమారి, తిరుమారెడ్డి మాధవి, దొడ్డి జగదీష్, జిల్లా పెద్దిరాజు, కటికతల జాన్‌వెస్లీ, అష్రఫ్ ఉన్నీసా, కోఆప్షన్ సభ్యులు ఎండీ.జక్కీ, గుండుగొలను సావిత్రీ, మన్నే లలితాదేవి, ప్రతిపక్ష కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

కావాలనే ఆందోళన

కౌన్సిల్‌లోని సభ్యులందరికీ సమాన ప్రాతిపదికన నిధులు కేటాయించి వర్క్స్ అజెండాకు తీసుకువచ్చామని చైర్‌పర్సన్ హైమావతి విలేకర్ల సమావేశంలో చెప్పారు. ప్రతిపక్షాలు కావాలనే ఆందోళనకు దిగాయని ఆరోపించారు. అభివృద్ధిని అడ్డుకోవడం అప్రజాస్వామికమన్నారు. అధికార పక్ష కౌన్సిల్ సభ్యులు మాట్లాడారు.



నగర పంచాయతీ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

ఫ్యామిలీ డాక్టర్‌తో గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్యం

భీమవరం అర్బన్: ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ (ఫ్యామిలీ డాక్టర్) పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాలలో రోగులకు ఉచిత వైద్యం అందిస్తున్నామని వైద్యాధికారి పి.సత్యనారాయణరాజు అన్నారు. భీమవరం మండలంలోని గొల్లవానితిప్ప ఫ్యామిలీ డాక్టర్స్ పథకంలో భాగంగా మంగళవారం రోగులకు 14 రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి పి.సత్యనారాయణరాజు మాట్లాడుతూ ఉదయం నుంచి వైద్య బృందంతో ఇంటింటికి తిరిగి రోగులను గుర్తించి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. మధ్యాహ్నం నుంచి అంగన్‌వాడీ సెంటర్లలోని, పాఠశాలలోని పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. 100 వాహనం ద్వారా వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. గ్రామీణ స్థాయిలో ఫ్యామిలీ డాక్టర్స్‌కు మంచి స్పందన వస్తుందన్నారు. ఎంతోమంది రోగులు పనుల్లో నిమగ్నమై ఆరోగ్య పట్ల ఎంతోమంది అశ్రద్ధ చూపుతున్నారని అలాంటి వారిని గుర్తించి ఫ్యామిలీ డాక్టర్స్ కార్యక్రమంలో చికిత్స అందిస్తున్నామన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఇలాంటి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.



గొల్లవానితిప్పలో రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి పి. సత్యనారాయణరాజు

కుక్కలకు రేబిస్ టీకాలు వేయించాలి

పాలకోడేరు: పెంపుడు, వీధి కుక్కలకు రేబిస్ వ్యాధి నిర్మూలన టీకాలు వేయించి వాటి ఆరోగ్యంతోపాటు ప్రజల ఆరోగ్యం కాపాడాలని ఎంపీపీ భూపతిరాజు సత్యనారాయణరాజు అన్నారు. పాలకోడేరు మండల పశువైద్యాధికారి మౌర్య సత్యేంద్ర పర్యవేక్షణలో జంతు సంక్షేమ పక్షోత్సవాల్లో భాగంగా మంగళవారం పాలకోడేరు, విస్సాకోడేరు, మోగల్లు గ్రామాల్లో పెంపుడు, వీధి కుక్కలకు రేబిస్ నివారణ టీకాలను వేశారు. కొత్తపల్లి కాశీ విశ్వనాథరాజు, సర్పంచ్ మరియమ్మ పాల్గొన్నారు.

ఆకివీడులో..

ఆకివీడు: జంతువుల వ్యాధులపై నిర్లక్ష్యం వహిస్తే అవి మనుషులకు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ కె.జనార్దన్ హెచ్చరించారు. జంతు సంక్షేమ పక్షోత్సవం సందర్భంగా మంగళవారం అయిభీమవరంలో పశువులకు, కుక్కలకు రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేశారు.

భీమవరంలో..

భీమవరం(ప్రకాశం చౌక్): జంతు సంక్షేమ పక్షోత్సవాల సందర్భంగా స్థానిక ఏరియా పశువుల ఆసుపత్రి వద్ద మంగళవారం పెంపుడు కుక్కలకు ఉచిత రేబిస్ వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం నిర్వహించారు. 138 పెంపుడు కుక్కలకు ఉచిత రేబిస్ వ్యాధి నివారణ టీకాలు వేశారు. భీమవరం ఏరియా పశు వైద్యశాల ఉపసంచాలకులు డాక్టర్ పి.సుధీర్, డాక్టర్ మురళీకృష్ణ పాల్గొన్నారు.

వరిలో వెదజల్లు పద్ధతి లాభదాయకం

ఆకివీడు: వరి సాగులో వెదజల్లు పద్ధతి ఎగువ ప్రాంత రైతులకు ఉపయోగకరమని కేవీకే శాస్త్రవేత్త ఎస్.మల్లికార్జునరావు చెప్పారు. సిద్ధాపురంలో రబీ సాగులో వెదజల్లు పద్ధతిని శాస్త్రవేత్తలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోతట్టు ప్రాంతాలకన్నా నీరు తక్కువగా నిల్వ ఉండే ప్రాంతంలో వెదజల్లు లాభదాయకమన్నారు. తక్కువ విత్తనాలు, కూలీల ఖర్చులు, సమయం ఆదా, నీటి వినియోగం తగ్గడంతో పాటు అధికంగా పిలకలు వేయడంతో దిగుబడులు పెరుగుతాయని మల్లికార్జునరావు వివరించారు. వెదజల్లులో కలుపు మొక్కలు పెరిగే అవకాశం ఉందని, కలుపు నివారణకు వెదజల్లిన 3, 5 రోజుల తరువాత పైరజోసల్ఫ్యూరాన్, ఇథైల్ 80–100గ్రాములు వాడాలన్నారు. 20 రోజుల తరువాత బిస్పైరిబాక్ సోడియం 100 ఎంఎల్ మందును పిచికారీ చేయాలని సూచించారు. గ్రామంలోని పలు చోట్ల నాట్లు వేసిన సాగులో కండం తొలుచు పురుగు అక్కడక్కడా ఆశించిందని ఏడీఏ శ్రీనివాసరావు చెప్పారు. దీని నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 2జీ గుళికలు8 కేజీలు, లేదా, కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు ఎకరానికి 10 కేజీలు చల్లినట్లు అయితే పంట నష్టం తగ్గించుకోవచ్చునని చెప్పారు. ఏఓ ఎమ్మార్సీ. ప్రియాంక, వీఏఏలు పాల్గొన్నారు.



సిద్ధాపురంలో వెదజల్లు పద్ధతిలో వరి సాగును పరిశీలిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు